# మేం సహజ మిత్రులం

● వామపక్షాలతో కలిసి పనిచేస్తాం ● అన్నీ సర్దుబాటు చేసుకున్నాం
● తెరాస కలిసొస్తుందో లేదో వారే చెప్పాలి ● చంద్రబాబు వ్యాఖ్యలు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** శాశ్వత ప్రయోజనాల కోసం తెలుగుదేశం, వామపక్షాలు కలిసి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పని చేస్తాయని తెదేపా అధినేత చంద్రబాబు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాతో కలిసి పనిచేయడానికి సీపీఐ రాష్ట్రకమిటీ నిర్ణయం తీసుకోవడం పట్ల వారికి అభినందనలు తెలిపారు. సోమవారం రాత్రి మఖ్దూం భవన్‌కు వచ్చిన చంద్రబాబు.. సీపీఐ నేతలు కె.నారాయణ, సురవరం సుధాకరరెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాము సహజ మిత్రులమని, 1984 నుంచి 1998 వరకు కలిసి పనిచేశామని, జాతీయస్థాయిలో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేయడంలో తమదే కీలకపాత్ర అని గుర్తుచేశారు. తర్వాత కొన్ని అపార్థాలతో దూరమై వారు కాంగ్రెస్ పార్టీకి దగ్గరైనా, అక్కడ ఇమడలేకపోయారన్నారు. ఇప్పుడు సీపీఐ, సీపీఎంలు మళ్లీ తెదేపాతో కలిసి పనిచేయడానికి నిర్ణయించడం చరిత్రపై ప్రభావం చూపుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. తమతో కలిసొచ్చే పార్టీలను కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. "తెరాస నుంచి ఇటీవల గందరగోళ ప్రకటనలు వస్తున్నాయి. మాతో కలిసి వస్తుందో లేదో ఆ పార్టీ ఆలోచనా విధానంపైనే ఆధారపడి ఉంటుంది" అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తెదేపా అధికారంలో ఉన్నప్పుడు అఖిలపక్ష సమావేశానికి సీపీఐని ఆహ్వానించకపోవడానికి కొన్ని కారణాలున్నాయని, దానికి విచారం వ్యక్తం చేస్తున్నానని చంద్రబాబు చెప్పారు. తెదేపా అధికారంలో ఉండగా చోటుచేసుకున్న బషీర్‌బాగ్ కాల్పుల ఘటన, ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 'కమ్యూనిజం లేదు.. ఏ ఇజం లేదు.. ప్రస్తుతం ఉన్నదల్లా టూరిజమే' అన్న తన వ్యాఖ్యలపై ఆయన సమాధానాలు దాటవేశారు. అన్ని విషయాలు మాట్లాడుకున్నామని, ఆ మేరకు సర్దుబాట్లు కూడా చేసుకున్నామని తెలిపారు. అంతకు ముందు నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు బలమైన కూటమి అవసరమని తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయించినట్లు చెప్పారు.

## బాబుకు సాదర స్వాగతం

అంతకుముందు మఖ్దూం భవన్‌కు వచ్చిన చంద్రబాబుకు నారాయణ సహా పలువురు సీపీఐ నేతలు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. బాబు వెంట తెదేపా నేతలు యనమల రామకృష్ణుడు, ఎర్రన్నాయుడు, కంభంపాటి రామ్మోహన్ రావు, తుమ్మల నాగేశ్వరరావు, నన్నపనేని రాజకుమారిలు ఉన్నారు. అనంతరం సమావేశ మందిరంలో సీపీఐ నేతలతో అరగంటపాటు చర్చలు జరిపారు. సీపీఐ ఉప ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, అజీజ్‌పాషా, పల్లా వెంకటరెడ్డి, సిద్ధి వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, వి.రామనరసింహారావు, ముప్పాళ్ల నాగేశ్వరరావు, పి.జె.చంద్రశేఖరరావు, నాజర్ వలీ తదితరులు ఈ చర్చల్లో పాల్గొన్నారు.

**జిల్లాల్లో సర్దుకుపోవాలి:** వామపక్ష పార్టీలతో సర్దుబాటు ధోరణిలో వ్యవహరించాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. తెదేపా రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెదేపా-వామపక్షాలు సహజమిత్రులని, పొత్తుల్లో భాగంగా పరస్పరం సహకరించుకోవాలని చెప్పారు.